# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తును రూపొందిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.**
2. **కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**
3. **పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీకి పురస్కారం లభించింది.**
4. **ఈరోజు పౌర సేవల దినోత్సవం.....సివిల్ సర్వీసెస్ డే నిర్వహిస్తున్నారు.**

===========================

ఈరోజు పౌర సేవల దినోత్సవం.....సివిల్ సర్వీసెస్ డే నిర్వహిస్తున్నారు. ప్రజలకు పౌర సేవల అధికారులు మెరుగైన సేవలు అందించడం..., తద్వారా ప్రజలు వారి... వారి ప్రాథమిక హక్కులు పొందేలా చూడడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. భారతదేశ మొదటి హోం మంత్రిగా వ్యవహరించిన ఉక్కు మనిషి సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ 1947 ఏప్రిల్ 21 వ తేదీన మొదటి బ్యాచ్ పౌర సేవల ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించిన రోజును గుర్తు చేసుకుంటూ... 2006వ సంవత్సరం నుండి ప్రతి ఏటా ఏప్రిల్ 21 న పౌర సేవల దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పౌర సేవల విభాగంలో ఉత్తమ సేవలు అందించిన వారికి పురస్కారాలు అందజేస్తారు.

---------------------------

ప్రభుత్వం రూపొందిస్తున్న విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్తును రూపొందిస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈరోజు న్యూఢిల్లీలో 17వ సివిల్ సర్వీసెస్ దినోత్సవం సందర్భంగా ప్రజా పరిపాలనలో అత్యుత్తమ సేవలు అందించిన వారికీ ప్రధానమంత్రి అవార్డులను ప్రదానం చేశారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరిన తీరును బట్టి పరిపాలనా నాణ్యత తెలుస్తుందని ఆయన తెలియజేస్తూ...

వాయిస్.. 32 సెకన్లు

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో రాష్ట్రంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖల సహాయమంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. గుంటూరు

నగరంలోని శంకర్ విలాస్ పైవంతెన కోసం భవనాలు, స్థలాలు కోల్పోతున్న వారికి ఆయన ఈరోజు పరిహారం అందించారు. రైల్వే లైన్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై..స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ...ఆర్ఓబీ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని తెలియజేస్తూ...

వాయిస్.. 30 సెకన్లు

---------------------------

గుజరాత్‌లో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ బృందం పర్యటన కొనసాగుతోంది. ఈరోజు ఉదయం 8.30 గంటలకు అహ్మదాబాద్‌లోని గ్యాస్పూర్‌లో జిందాల్ ఘన వ్యర్థాల నిర్వహణ ప్లాంట్‌ను పరిశీలించింది. అనంతరం రాష్ట్ర రాజధాని అమరావతిలోని క్రీడా నగరంలో క్రికెట్ స్టేడియం నిర్మించనున్న నేపథ్యంలో నిర్మించనున్న నరేంద్రమోదీ స్టేడియంను మంత్రి బృందం సందర్శించింది.

---------------------------

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన రేపు ఉదయం 10 గంటల 30 నిమిషాలకు గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ తొలి సమావేశం జరగనుంది. ఈ సమావేశానికి కమిటీ సభ్యులందరూ హాజరుకానున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటనలో వెల్లడించింది.

---------------------------

స్వీయ మద్దతు విధానంలో నిర్వహించే ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ ఎంట్రన్స్ టెస్ట్ – ఏయూఈఈటీ–2025కు ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ డీఏ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 750 రూపాయల అపరాధ రుసుముతో మే ఒకటో తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. మే మూడో తేదీన హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవాలని, మే ఐదో తేదీ మధ్యాహ్నం 2 గంటల 30 నిమిషాల నుంచి నాలుగు గంటల వరకు పరీక్ష నిర్వహిస్తామన్నారు. మే ఆరో తేదీన ప్రిలిమినరీ కీ విడుదల చేస్తామని, ఎనిమిదో తేదీన వరకు ప్రిలిమినరీ కీపై అభ్యంతరాలను స్వీకరిస్తామని, తొమ్మిదో తేదీ ఉదయం 10 గంటలకు ఫైనల్ కీ విడుదల చేయనున్నట్టు తెలిపారు. అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ఫలితాలను విడుదల చేయనున్నట్టు వివరించారు.

---------------------------

పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించిన జాతీయ స్థాయి అవార్డుల్లో రాష్ట్రంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీకి పురస్కారం లభించినట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ వెల్లడించింది. ఆత్మ నిర్భర్ పంచాయతీ కేటగిరిలో ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ రూరల్ మండలంలోని గొల్లపూడి గ్రామ పంచాయతీ మూడవ స్థానం సాధించినట్లు నిన్న విడుదల చేసిన ప్రకటనలో ఆ శాఖ పేర్కొంది. సొంత ఆదాయ వనరులు పెంపొందించుకున్న పంచాయతీలకు ఇచ్చే ఈ అవార్డును గొల్లపూడి గ్రామ పంచాయతీ దక్కించుకున్నట్లు చెప్పారు. ఈ నెల 24వ తేదీన పంచాయతీ రాజ్ దివస్ సందర్భంగా బీహార్ రాష్ట్రంలోని మధుబనిలో జరిగే జాతీయ స్థాయి వేడుకల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అవార్డులు ప్రధానం చేయనున్నట్లు వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా ఈనెల 23 వ తేదీన సాలూరు పట్టణంలోని శ్రీ సత్యసాయి డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా జరగనుందని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఏ. శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. నిరుద్యోగ యువత జాబ్ మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. 10వ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డీగ్రీ చదువుకొని 18 నుంచి 28 ఏళ్లు ఉన్న నిరుద్యోగ యువతి, యువకులు ఈ జాబ్ మేళాకు అర్హులన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 121వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. "మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

రబీ ధాన్యం కొనుగోలుకు ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 107 కేంద్రాలను ఏర్పాటు చేయగా, వీటిల్లో గోనె సంచులు, రవాణా వాహనాలు, కార్మికులను సిద్ధంగా ఉంచామని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి. సతీష్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లాలో నిన్నటి వరకు 2065 మంది రైతుల నుంచి 57.39 కోట్ల రూపాయల విలువైన 27 వేల 97 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని సతీష్ వెల్లడించారు. ఇప్పటి వరకు రైతులకు రూ.46.83 కోట్ల నగదు చెల్లించగా, మిగతా 5.34 కోట్ల రూపాయలు చెల్లించడానికి కూడా సిద్ధంగా ఉన్నామని ఈ సందర్భంగా వివరించారు. ధాన్యం కొనుగోలులో ఏవైనా ఇబ్బందులుంటే విజయవాడలోని కంట్రోల్ రూమ్ నంబర్ 77020 03571కు ఫోన్ ద్వారా తెలియజేయవచ్చని ఆయన సూచించారు.

---------------------------

దేశ వ్యాప్తంగా చిన్నారులు, స్త్రీల ఆరోగ్య పరిరక్షణ కోసం పోషక ఆహారాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం "జాతీయ పోషకాహార మిషన్" ను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా 7 వ విడత పోషణ పక్షోత్సవాలను ఈ నెల 22 వ తేదీ వరకు నిర్వహిస్తోంది. పోషన్ పఖ్వాడా చిన్నారుల జీవితంలో పోషక అభివృద్ధికి కీలకమైన మొదటి వెయ్యి రోజులపై దృష్టి పెడుతుంది. తీవ్రమైన పోషకాహార లోపం ఉన్న వారిని ముందుగా గుర్తించి తగిన సంపూర్ణ పోషణ అందించేలా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అలాగే ఈ కార్యక్రమం పోషకాహార ప్రాధాన్యాన్ని తెలియజేయడంతో పాటు బాలల్లో ఊబకాయంపై దృష్టి సారిస్తుంది.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ……

…..వాయిస్…. 26 సెకన్లు….

=====================